702) లలిత

ప॥ ఇంతగాలమాయ నన్ను యేమీనన్నవారు లేరు । చింత సంసారపుమాయ జిక్కించనేకాని ॥

చ॥ యెందరు బ్రహ్మలో నన్ను యిటు పుట్టించినవారు । యెందరు యములో హరియించినవారు ।
యెందుకు నందుకేకాని యిల నే జేసినపాప- । మంది వహించుక కాచినట్టివారు లేరు ॥

చ॥ తల్లిదండ్రు లెందరో తనువు ఎంచినవారు । కొల్లగా సతులెందరో కూడినవారు ।
చిల్లరపనికేకాని చేరబిలిచి వైకుంత- । ముల్లసాన నిచ్చేవారు వొకరూ లేరు ॥

చ॥ కాలమును వీటిబోయె కర్మమును దెగదాయ । మూలనుండి యెవ్వరికి మొరవెట్టేను ।
ఆలించి శ్రీవేంకటేశ అంతరాత్మవై నన్ను- । నేలితివి యింతపని కెవ్వరును లేరు ॥